భీమవరం అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. ముందుగా 40 లక్షల రూపాయలతో శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవాలయం నుంచి వెంకటేశ్వర బుక్ డిపో వరకు నిర్మించే బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 30 లక్షలతో రెస్ట్ హౌస్ రోడ్డు నుంచి సింహాద్రి అప్పన్న గుడి వరకు నిర్మించే బీటీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. తదనంతరం రూ.39.40 లక్షలతో 13వ వార్డు యర్రంశెట్టి వారి వీధిలో నూతనంగా నిర్మాణం చేసిన సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయ్యిందని, రెండు సంవత్సరాలు పాటు కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందని అయినప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ నాలుగేళ్ల కాలంలో 98 శాతానికి పైగా హామీలను అమలు చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ముఖ్యంగా భీమవరం నియోజకవర్గానికి వస్తే ఒక పక్క అభివృద్ధి, మరో ప్రక్క సంక్షేమం పెద్ద ఎత్తున జరుగుతుందని ఇందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేస్తున్నామని, ప్రజల కోరిక మేరకు, వారి సూచనల మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పథంలో భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తున్నానని, ఇందుకు ప్రజలు అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. అభివృద్ధి అనేది మాటల్లో కాదని చేతల్లో చూపిస్తున్న తమ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆయన వివరించారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నాని అన్నారు.



మావుళ్లమ్మ ఆలయం వద్ద బీటీ రోడ్డుకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరంలో టెన్త్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని కీర్తికి సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల నర్సింహరాజు, గౌడ కార్పొరేషన్ డైరక్టర్ కామన నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, మానేపల్లి నాగేశ్వరరావు, బగ్గ జయరాం, గుంటి ప్రభు, మద్దుల కరుణకుమార్, జంగం బాబూరావు, గంటా సుందర్‌కుమార్, బి.ధర్మ, ముల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యకు దాతల సహకారం ప్రశంసనీయం

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో ఉన్నత విద్యనభ్యసించే పేద విద్యార్థులకు దాతల అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక పొట్టిశ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్ విద్యార్థిని కొట్టి కీర్తిశ్రీరంగ శివాని టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 582 మార్కులు సాధించిన సందర్భంగా ఆమె ఉన్నత చదువులకు పట్టణంలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ రూ. 10 వేలు, శ్రీశంకర్ సిల్క్స్ యజమాన్యం రూ. 5 వేలు నగదును శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చిన్ని బాబురావు, సంగడి బుజ్జి, ఉపాధ్యక్షులు అయిశెట్టి లక్ష్మణమూర్తి, బాలాజీగుప్త, కోశాధికారి మావూరి సుందరరావు, లలిత్‌కుమార్ అగర్వాల్,సునీల్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎడ్వర్డ్ ట్యాంకు అభివృద్ధికి సహకారం



భీమవరంలో కలెక్టర్ ప్రశాంతిని కలిసిన రోటరీక్లబ్ నాయకులు

సాక్షి, భీమవరం: భీమవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఎడ్వర్డ్ ట్యాంక్ పార్కు, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఎస్ సాయి దుర్గాప్రసాద్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు కిషోర్, అష్మఖ్ లాల్‌జైన్ కలెక్టర్ పి ప్రశాంతికి వివరించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రశాంతిని కలిసి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు రూ.35 లక్షల వ్యయంతో పార్క్, వాకింగ్ ట్రాక్ సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి ఎడ్వర్డ్‌ట్యాంక్ అభివృద్ధికి స్వచ్ఛందంగా రోటరీ క్లబ్ ముందుకు రావడం దానికి జూపూడి సంజయ్ వంటి వారు సహకరించడం అభినందనీయమన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రోటరీ క్లబ్ డైరెక్టర్స్ బొండా వెంకట సుబ్బారావు, షేక్ బాబాజీ సాహెబ్ తదితరులున్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ వెంకటరమణ

సాక్షి, భీమవరం: పట్టణంలో శనివారం వివిధ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షల్లో ఏపీఆర్‌జేసీ పరీక్షకు 729 మందికి 144 మంది గైరహాజరుకాగా ఏపీఆర్డీసీ పరీక్షకు 11 మందికి నూరు శాతం హాజరయ్యారు. అలాగే ఏపీఆర్ఎస్ కాట్‌కు 115 మందికి 69 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. అలాగే భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన లాసెట్ పరీక్షకు 130 మందికి గాను 115 మంది హాజరైనట్లు పర్యవేక్షకుడు తెలిపారు.

కాళ్లకూరులో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఈఓ అరుణ్ కుమార్

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు ఉన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి అరుణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు, భక్తుల దాహార్తిని తీర్చేందుకు స్వామి వారి ఆలయ ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

సత్యనారాయణమ్మ మృతి తీరని లోటు



కడలి సత్యనారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: మాజీ ఎంపీటీసీ సభ్యులు కడలి సత్యనారాయణమ్మ మృతి తీరని లోటని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తెలిపారు. రాయకుదురులోని ఆమె ఇంటి వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించి, సత్యనారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహారావు, మాజీ మండల కన్వీనర్ నేతలు జ్ఞాన సుందర రాజు నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, కడలి రామారావు, కడలి సత్యనారాయణ, చిక్కాల రాజు తదితరులు పాల్గొన్నారు.

సికిలే స్కూల్ తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

నరసాపురం రూరల్: పట్టణ పరిధిలోని జె.సికిలే ప్రైవేటు పాఠశాలను శనివారం సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ డీఈఓ వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్ రికార్డులు, బుక్స్ గోడౌన్‌ను వారు నిశితంగా పరిశీలించారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలు వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాట శిబిరంపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఎస్సై మోహన్‌రావు తన సిబ్బందితో యనమదుర్రు గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కారును ఢీకొట్టిన జేసీబీ

సాక్షి, భీమవరం: నిర్లక్ష్యంగా జేసీబీతో కారును ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడినట్టు విజయవాడ విద్యాధరపురానికి చెందిన కె.కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం వెంకటేశ్వరరావు శనివారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కోటేశ్వరరావు మరొక నలుగురు విజయవాడ నుంచి భీమవరం వచ్చి శుక్రవారం తిరిగి వెళుతుండగా పట్టణంలోని విస్సాకోడేరు వంతెన వద్ద నిర్లక్ష్యంగా వచ్చిన జేసీబీ వాహనం ఢీకొట్టిందని ఈ ప్రమాదంలో కారులో ఉన్న సాయికృష్ణ, గోపికృష్ణ, మల్లేశ్వరి గాయపడ్డారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాలకోడేరు: గ్రామాల్లో స్వయంగా సమస్యలను తెలుసుకుని అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. శనివారం ఆయన వేండ్ర గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఏదో ఒక పథకంలో లబ్ధి పొందామని పిల్లాపాపలతో నా కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని ఆ పథకాల నిరంతరాయంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలిపించుకుంటామని ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని అన్నారు గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేశాయని జగనన్న ప్రభుత్వంలో ఇచ్చిన హామీలే కాక ఇవ్వని హామీలు కూడా నెరవేర్చి ప్రజల మన్ననలను పొందిందని కావున మీరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. డెల్టా పేపర్‌మిల్లు కార్మికులుగా పనిచేయడానికి నార్త్ ఇండియన్ నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారని వారికి ధ్రువపత్రాలు విషయంలో ఇబ్బంది ఉందని మా దృష్టికి తీసుకొచ్చారని, ఈ సర్టిఫికెట్ల విషయంలోతహసీల్దార్ తో మాట్లాడి వారికి ధ్రువపత్రాలు ఇచ్చే ఏర్పాటు చేయమని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, సర్పంచ్ కడలి నాగేశ్వరి, చేకూరి నరేంద్రరాజు, ఉప సర్పంచ్ భూపతి రాజు సుబ్బరాజు, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు, గోపాలపురం నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు దాసరి కిరణ్ కుమార్, కె.వెంకటేశ్వరరావు, సానబోయిన వేణు, వేగి రమణ, నేలపాటి రాజబాబు, బుడితి నాగరాజు, వీరబాబు, కేసుబోయిన వెంకటేశ్వరరావు, దేవరాజ్, జాన్, కె.రాంబాబు, వర్మ, దావాల శ్రీను , పెన్మత్స శ్రీనివాసరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, గుండు నాగేశ్వరరావు, బొల్లా శ్రీనివాస్, ఇంజేటి మరియమ్మ, కడలి సుబ్రహ్మణ్యం,బొక్కా రాంబాబు, శివకోడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



వేండ్ర లో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

తేనెటీగల వల్ల ఎన్నో ప్రయోజనాలు

సాక్షి, భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం తేనెటీగల వల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలు । అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణవేత్త మట్లపూడి సత్యనారాయణ మాట్లాడుతూ తేనెటీగ ఎంతో విలువైన ఔషధ సహితమైన ఆహారాన్ని మానవాళికి ఉత్పత్తి చేస్తుందన్నారు. తేనెటీగలు సహజమైన ప్రవృత్తి ద్వారా వ్యవసాయ క్షేత్రాలలో రకరకాల పంటలు, తోటల్లో పరాగ సంపర్కం ద్వారా సకాలంలో ఫలదీకరణ చర్యలను విజయవంతం చేయడానికి పంటల దిగుబడికి ప్రధాన కారణమవుతున్నాయన్నారు. జీవావరణ చక్రంలో కీటకాల ఆవశ్యకత గురుంచి ప్రజలకు అవగాహన కలుగజేస్తూ వాటి నష్ట నివారణ చర్యలు తీసుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని సత్యనారాయణ అన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, కథలు, యోగా వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, కలిగొట్ల గోపాలశర్మ, డి.రామనాగేశ్వరరావు, కె.లక్ష్మి పాల్గొన్నారు.



భీమవరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కోపల్లెలో..

కాళ్ల: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకొని విజ్ఞానం పొందాలని గ్రంథాలయ అధికారిణి కె.స్వరూపారాణి అన్నారు. శనివారం కోపల్లె గ్రంథాలయంలో స్థానిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గత 13 రోజులుగా విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ డ్రాయింగ్ టీచర్ ఎం.రాజేంద్రబాబు, గ్రంథాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పాలన

ఉండి: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగుతుందని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. శనివారం వాండ్రంలో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షల అంచనాలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండలపార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ సమస్య ఉన్నా దానిని వెంటనే పరిష్కరించాలని సీయం ఆదేశిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ డ్రెయిన్‌ల నిర్మాణం చాలా అవసరమన్నారు. అందుకే గ్రామాల అభివృద్ధిలో పారిశుద్ధ్యం ఓ భాగమైందని అందుకే అన్ని గ్రామాల్లోను సీసీ డ్రెయిన్‌లు, అండర్ గ్రౌండ్ డ్రెయిన్‌ల నిర్మాణాలు చేపడతామని అన్నారు. వాండ్రం నుండి ఉండి వెళ్ళే ఆర్అండ్‌బీ రోడ్డు నారాయణ రెడ్డి ఫ్యాక్టరీ వద్ద నుండి ఒక కి.మీ మేర సుమారు రూ.1.30 కోట్లతో త్వరలోనే నిర్మాణం చేపట్టబోతున్నట్లు పీవీఎల్ తెలిపారు కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ, రణస్తుల మహంకాళి, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు రంగరాజు, పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, కోనాల రాజేంద్రకుమార్, యాడంగి ఏసు, కోనాల మహంకాళి తదితరులు పాల్గొన్నారు.



వాండ్రంలో సీసీ డ్రైయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మొగల్తూరు: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి విజయలక్ష్మి సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని కొత్తోట గ్రామంలోని సచివాలయంలో లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈగ్రామంలో 12 మంది లబ్ధిదారులకు పట్టాలు అందిస్తే ఇంత వరకు ఇద్దరు మాత్రమే ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావడం ఏంటి? అని ప్రశ్నించారు. జగనన్న లేఅవుట్‌లలో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించుకునే ఉద్దేశం లేకపోతే పట్టాలు తిరిగి ఇచ్చేస్తే అర్హులైన మరోకరికి ఇస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులంతా మరో వారం రోజుల్లో ఇళ్లనిర్మాణాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ పడవల సత్యనారాయణ, ఎంపీడీఓ ఆర్వీ ఆనంద్ కుమార్, ఏపీఓ వై.శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ ఫణీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం




ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం


భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా భీమవరం పురపాలక సంఘం పరిధిలో ≪మేరి లైఫ్, మేరి స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంలో భాగంగా రెడ్యూస్, రియూజ్, రీసైకిల్(ఆర్ఆర్ఆర్)సెంటర్ ను అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి. జ్యోతి లక్ష్మి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వేండ్ర ప్రసాద్ శనివారం బీవీరాజు పార్క్ వద్ద ఉన్న 3వ శానిటరీ డివిజన్ ఆఫీస్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు వచ్చే నెల 5 వరకూ ఆర్ఆర్ఆర్ సెంటర్‌లో పాత వస్తువులు, పుస్తకాలు, చెప్పులు, పాత ఆట బొమ్మలు, పాత దుస్తులు,ప్లాస్టిక్ వస్తువులు మొదలైన నిరుపయోగంగా ఉండే వస్తువులును అందజేయాలని తెలియచేశారు. వీటిని అవసరం ఉన్న ఇతరులకు అందిస్తామని తెలిపారు. పట్టణంలో మరో మూడు ప్రదేశాల్లో ఈ ఆర్ఆర్ఆర్ కేంద్రాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

డీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షి, భీమవరం: డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు సకాలంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న భర్తీకి ఉపాధ్యాయ పోస్టులకు వెంటనే డీఎస్సీ నిర్వహించాలని కోరారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.కార్తీక దామోదర్, బి.ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షులుగా ఆర్.యరకేశ్వరరావు, ఎం.సురేష్, కార్యదర్శులుగా టి.గోపాలకృష్ణ, వి.బాల బాలాజి, సీహెచ్ కిరణ్ ఎన్నికయ్యారని తెలిపారు.



కార్తీక్ దామోదర్



ప్రసన్న కుమార్

ప్రశాంతంగా పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాలకోడేరు: అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు అన్నారు. ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు అధ్యక్షతన పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శృంగవృక్షం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు సవరం సత్యకృష్ణ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో అభివృద్ధి పనులు చేయకపోవడంపై సమావేశ మందిరంలో కింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. పెన్నాడ సర్పంచ్ చిల్లా అనూష మాట్లాడుతూ ఆశా వర్కర్లు సరిగా పని చేయడం లేదని, వారి పని తీరును మదింపు చేయాలని ఫిర్యాదు చేశారు. వారి విషయంలో శ్రద్ధ తీసుకుంటానని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ సత్యనారాయణ రాజు శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మి తులసి, ఎంపీటీసీలు కాటూరి శాంతకుమారి, పాలా జ్యోతి భారతి, మల్లుల సూర్య కళ, ఎంపీడీఓ మురళి గంగాధర రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌కు సత్కారం

తణుకు టౌన్ : ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌ను జిల్లా బీసీ సంక్షేమ సంఘ నాయకులు కలసి సత్కరించారు. శనివారం తేతలి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని వంకా రవీంద్రనాథ్‌ను బీసీ సంఘం నాయకులు కలసి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు రంధి అప్పారావు, షేక్ మస్తాన్, ఎస్.సీతారామరాజు పాల్గొన్నారు.

నేడు క్యాండిల్ ర్యాలీ

తణుకు అర్బన్ : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, మృతులపై సానుభూతిని తెలిపే విధంగా ఆదివారం క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం పురస్కరించుకుని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి ఈ క్యాండిల్ ర్యాలీని ప్రారంభించనున్నట్లు వివరించారు.

చీఫ్ జస్టిస్‌కు అభినందనలు

పాలకోడేరు: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఎంపికైన ఆకుల వెంకట శేష సాయిని శృంగవృక్షం ఆర్యవైశ్య సంఘం అభినందించింది. శనివారం భీమవరం లోని ఆయన నివాసంలో కలుసుకుని తెలుగు బిడ్డ ఉన్నత స్థాయిలో ఉండడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు చిరుజ్ఞాపికను బహూకరించారు. ఆయనను కలిసిన వారిలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్యం సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి సోము సాయి రామకృష్ణ కార్యవర్గ సభ్యుడు గ్రంధి రాజా, పంచాయతీ వార్డు సభ్యురాలు సోము దుర్గాభవాని ,కూర్మా ల శ్రీనివాసరావు ,సీతా మహాలక్ష్మి, ఉన్నారు ఆయన వెంట భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మొగ్గల వెంకట రమణారావు ఉన్నారు.

ప్రత్యేక కారాగారం తనిఖీ



భీమవరంలో ప్రత్యేకకారాగారాన్ని తనిఖీ చేస్తున్న జడ్జి సురేష్‌బాబు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ప్రత్యేక కారాగారాన్ని ఒకటవ అధనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ సురేష్‌బాబు శనివారం తనిఖీచేశారు. ముందుగా వంటశాల, కూరగాయలు, జైలు ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న రోజువారీ ఆహార పదార్థాలు, విజిటింగ్ డాక్టర్ ఎప్పుడెప్పుడు వస్తున్నారనే విషయాలను ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయి క్రమశిక్షణ, పరివర్తన, బాధ్యతతో ఉండాలని ఆర్థి కస్తోమత లేని వారికి మండల న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బి.సురేష్ కుమార్, జైల్ పర్యవేక్షణా ఇన్‌చార్జ్ అధికారి ఎ కుమార్ స్వామి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి



భీమవరం కలెక్టరేట్ వద్ద డీఆర్వో కృష్ణవేణికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌శరణ్‌సింగ్‌ను ఎంపీ సభ్యత్వం నుంచి తక్షణమే సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి డీఆర్వో కె.కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పుష్పకుమారి మాట్లాడుతూ ఎన్నో రోజులుగా తమకు న్యాయం చేయాలని పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోడదాసి సరోజిని, అన్నెపు లక్ష్మి, ఎస్.పావని, టి.దేవదర్శిని, పి.లక్ష్మి, అడపా దేవి తదితరులు పాల్గొన్నారు.